క్లుప్తంగా

ఇస్రో 'యువికా'కు నవోదయ విద్యార్థి ఎంపిక



బండారు దుర్గేష్

యానాం: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) సంస్థ నిర్వహిస్తున్న యువికా కార్యక్రమానికి యానాం నవోదయ విద్యాలయ విద్యార్థి బండారు దుర్గేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ విద్యార్థుల్లో స్పేస్ టెక్నాలజీ, శాటిలైట్ల తయారీ తదితర అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేందుకు యువికా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. దేశంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యువికా కార్యక్రమానికి సంబంధించి ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించారని దాంట్లో దుర్గేష్ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా దుర్గేష్‌ను అధ్యాపకులు అభినందించారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

యానాం: తమ గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ కనకాలపేట గ్రామస్తులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు శనివారం విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆందోళనను అర్థం చేసుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్‌కు తాము వినతి పత్రం ఇచ్చామని ఎమ్మెల్యే అశోక్‌కు వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అశోక్ కనకాలపేట డంపింగ్ యార్డు శాశ్వతంగా తొలగించడానికి గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కాని ప్రస్తుతం డంపింగ్ యార్డులో జరుగుతున్న పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే అశోక్ కోరారు. గోపాల్‌నగర్‌లో పవర్‌గ్రిడ్ వద్ద రీసైక్లింగ్ ప్లాంట్ పెట్టాలని తాను ఏనాడు ప్రభుత్వానికి గాని, అధికారులకు గాని సూచించలేదన్నారు.

కేంద్ర బలగాల కవాతు



జనుపల్లి గ్రామంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

అమలాపురం రూరల్: మండలంలోని జనుపల్లి, నల్లమిల్లి, ఎ.వేమవరం గ్రామాల్లో సీఐ వీరబాబు, ఎస్ఐ శేఖర్‌బాబుల ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తామని ప్రజలకు భరోసా కల్పించేందుకు శనివారం సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు.

967 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గానికి వచ్చే నెల 19న ఎన్నికల కోసం యనాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ నాలుగు రీజియన్లలో కలిపి మొత్తంగా 967 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎ.కులొంతుంగన్ శనివారం తెలిపారు. ఎన్నికల కోసం 2,880 ఓటింగ్ మిషన్లు, 1,486 ఈవీ ప్యాట్‌లను సిద్ధం చేశామన్నారు. ఓటింగ్ ప్రక్రియలో విధులు నిర్వహించేందుకు 7,094 మంది ఉద్యోగులను నియమించి వారందరికీ దశల వారీగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వేచ్ఛగా ఓటును వేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి వినయ్‌రాజ్ పాల్గొన్నారు.

ఆక్వా రంగం ద్వారా ఉపాధి అవకాశాలు

అమలాపురం రూరల్: కోనసీమలో ఆక్వా రంగం ద్వారా విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏయూ జంతు శాస్త్ర విభాగాధిపతి, మెరైన్ లివింగ్ రీసోర్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జానకీరామ్ అన్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో శనివారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ఆక్వాకల్చర్‌తో అవకాశం–సమస్యలు అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ కుమారశాస్త్రి, ఎ.రవీంద్ర, డాక్టర్ గాయత్రీదేవి, పి.త్రినాథరావు, డాక్టర్ ఎ.రాజు, సీహెచ్ సాయిరామ్, నల్లా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో జారిపడి యువకుడి మృతి

రావులపాలెం: కాలువలోకి స్నానానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ముమ్మిడివరపాడు గ్రామానికి చెందిన దిగుమర్తి గణేష్ (18) శుక్రవారం రాత్రి పక్క గ్రామమైన గోపాలపురంలోని పి.గన్నవరం కాలువ వద్దకు స్నానానికి వెళ్లాడు. అయితే ఎంత సేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికులు గాలింపు చర్యలు చేయగా శనివారం గణేష్ మృతదేహం సమీపాన కాలువ రేవు వద్ద దొరికింది. దీంతో ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

- రైతులకు ఇబ్బంది లేకుండా అధికారుల చర్యలు
- ఇప్పటికే మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం



ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్న భీమనపల్లి రైతు భరోసా కేంద్రం

ఉప్పలగుప్తం: రబీ కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్నదాతల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల సంస్థ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుకు కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది రబీ, ఖరీఫ్ వరి కోతల సమయంలో తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకుంది. ఈసారి ప్రతి సచివాలయ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశారు. కొనుగోలు కేంద్రాలకు అనుసంధానంగా వలంటీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు ధాన్యం కొనుగోలు మొత్తం మొబైల్ యాప్ ద్వారా జరగటంతో సాంకేతిక పరి/జ్ఞానంపై అధికారులు సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ప్రభుత్వం బాధ్యత వహించి కొనుగోళ్లు చేయటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హమాలీలు, రవాణా ఖర్చు ప్రభుత్వానిదే

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకంతో పాటు ఎంటీయూ 1121(శ్రీధృతి), 3626 (బొండాలు) రకాలను సైతం కొనుగోలు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం నాణ్యతను బట్టి సాధారణ రకానికి క్వింటాకు రూ.2183, గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2,203 చొప్పున ప్రభుత్వం రైతుకు మద్దతు ధర ప్రకటించింది. హమాలీలు, ధాన్యం రవాణాకు వాహనాల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

మండలం	కొనుగోలు కేంద్రాలు	సాగు (ఎకరాల్లో)
అమలాపురం	23	5164
ఉప్పలగుప్తం	11	5064
అల్లవరం	18	4200
ముమ్మిడివరం	13	5200
ఐ.పోలవరం	18	7800
తాళ్లరేవు	11	7830
కాట్రేనికోన	13	7900

రైతులు ధాన్యం విక్రయించే ముందు స్థానిక కొనుగోలు కేంద్రం వద్ద సమాచారం అందించి ధాన్యం యొక్క నాణ్యతను పరీక్షించుకుని అమ్మకానికి సిద్ధం చేసుకోవాల్సి ఉంది. తేమ శాతం 17 మించకుండా, గడ్డి, చెత్త ఒక శాతం, చెడిపోయిన, పురుగు తిన్న, పరిపక్వం కాని, ముడుచుకుని, వంకర తిరిగిన ధాన్యం 3 శాతం, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం 5 శాతం, తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు, కేళీలు 6 శాతం, తప్పతాలు, వ్యర్థాలు, మట్టి వంటివి ఒక శాతం మించకుండా రైతులు చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కష్టానికి తగిన ఫలితం



ప్రభుత్వమే ధాన్యం కొనుగోళ్లు చేస్తుండడం వల్ల రైతు కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. దీనివల్ల మిల్లర్లు, దళారీల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది. గతేడాది భారీ వర్షాలొచ్చినపుడు మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోయుంటే రైతులు నిలువునా మునిగేవారు.

– నల్లా వెంకటనారాయణ, రైతు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు కోత కోసిన తరువాత తగిన జాగ్రత్తలు తీసుకుని ధాన్యాన్ని ఆరబెడితే తేమ శాతం తగ్గుతుంది. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే ప్రతి ఆర్బీకేలో కొనుగోళ్ల నిమిత్తం ఏర్పాట్లు చేశాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి, ఉప్పలగుప్తం మండలం

అందుబాటులో ఆర్బీకే సిబ్బంది

ప్రతి ఆర్బీకేలో పరిధిలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, వీఏఏ, వీహెచ్ఏలు రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లకు సహకరిస్తారు. గతంలో ఈ–క్రాప్ చేసుకుని, ఈకేవైసీ పొందిన రైతులు మాత్రమే ఆర్బీకేల్లో ధాన్యం విక్రయించడానికి అర్హులు.

– ఎం.వెంకటరామారావు, వ్యవసాయ శాఖ ఏడీ, ముమ్మిడివరం

బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం



బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన సాయిరామ్‌ను అభినందిస్తున్న తోటి న్యాయవాదులు

అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి స్థానిక అసోసియేషన్ భవనంలో ఎన్నికలు శనివారం జరిగాయి. అధ్యక్ష పదవికి న్యాయవాదులు సాయిరామ్, కుడుపూడి అశోక్ పోటీపడ్డారు. ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది వీరిన సాయిరామ్ 104 ఓట్లు సాధించి గెలుపొందారు. ఒక్క అధ్యక్ష పదవికి మాత్రమే పోటీ జరగగా మిగిలిన పదవులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా పలనాటి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా నందిక శ్రీనివాస్, కార్యదర్శిగా సీహెచ్ఎస్ఆర్‌కే నాగేశ్వరరావు, లైబ్రెరీ సెక్రటరీగా జీబీ రవితేజ, కోశాధికారిగా సయ్యద్ హమీద్ బాషా, అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అడపా వెంకట సత్యప్రసాద్, మహ్మద్ ఇక్బాల్, మాకిరెడ్డి ఆదినారాయణ, మోకా సత్యనారాయణ, వరలక్ష్మీ నరసింహరావు, నందెపు చిన వెంకటేశ్వరరావు, రాపాక దేవదీవెన, బుడితి వెంకటరమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితర న్యాయవాదులు అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం



అమలాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- అమలాపురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణం ఒకటో వార్డు చింతగుంటచెరువు నుంచి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని విశ్వరూప్ శనివారం ఉదయం ప్రారంభించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి విశ్వరూప్ ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మమేకమయ్యారు. చింతగుంట చెరువు, ఎర్రవంతెన వద్ద మెయిన్ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, పద్మినీపేట, మెట్ల కాలనీ, విద్యుత్ నగర్ తదితర ప్రాంతాల్లో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ స్కూటీపై తిరుగుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విశ్వరూప్‌కు పలు చోట్ల మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. అభిమానులు పూల వర్షం కురిపించారు. మీరు మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తారు, మళ్లీ మంత్రి అవుతారంటూ పెన్షన్‌దారులు మంత్రిని ఆశీర్వదించారు. జై జగన్, జై విశ్వరూప్ అంటూ పార్టీ పాటలకు నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేసి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన జలవనరులశాఖ విశ్రాంత ఉద్యోగి సంసాని హరినాథరావుతో పాటు మరో ఇద్దరు మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి విశ్వరూప్ వారి మెడలో కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు, పార్టీ రాష్ట్ర, జిల్లా అనుబంధ కమిటీల నాయకులు సుంకర సుధ, ఉండ్రు వెంకటేష్, కముజు రమణ, కుడుపూడి భరత్ భూషణ్, ఈతకోట శ్రావణ్‌కుమార్, ఉండ్రు వెంకటేష్, మెండు సురేష్ ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొన్నాడ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



లక్ష్మీవాడలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నల్లా నరసింహమూర్తి

కాట్రేనికోన: ముమ్మిడివరం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి పిలుపునిచ్చారు. మండలంలో ఉప్పూడి, పెనుమల్లే, లక్ష్మీవాడ గ్రామాల్లో నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఏప్రిల్ 3న ఉప్పూడి, పెనుమల్లే, లక్ష్మీవాడ గ్రామాల్లో పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఎన్నికల ప్రచారం చేయడానికి మండల కమిటీ నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్ళి ఓట్లు అభ్యర్థించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు గుత్తుల సత్యనారాయణ, వంకా ఏడు కొండలు, చొల్లంగి శ్రీలక్ష్మి, ఉచ్చుల రవికుమార్, బీర ధనుంజయ్, చొల్లంగి వెంకటేశ్వరరావు, సలాది తులసీరావు, బీర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనతో సమావేశం నిలుపుదల



అనుమతులు లేవంటూ సమావేశాన్ని నిలిపివేస్తున్న అధికారులు

అల్లవరం: మండలంలోని గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో జనసేన నాయకులు శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో రాజబాబు అభిమానుల సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. రాజబాబు అమలాపురం అసెంబ్లీ స్థానానికి జనసేన పార్టీ నుంచి సీటు ఆశించారు. అయితే ఎన్‌డీఏ పొత్తులో భాగంగా అసెంబ్లీ సీటును టీడీపీకి కేటాయించారు. దీంతో రాజబాబు తన అభిమానులతో శనివారం సమావేశం నిర్వహిస్తుండగా ఆర్డీఓ ఆదేశాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హౌసింగ్ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీఓ కృష్ణమోహన్, పోలీసులు సమావేశ మందిరానికి వచ్చి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమావేశం నిర్వహించడానికి వీల్లేదని తెలిపారు. దీంతో గత్యంతరం లేక రాజబాబు సమావేశాన్ని మధ్యలోనే నిలిపివేశారు. అయితే అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సమావేశం నిర్వహించడంపై నిర్వాహకులు, ఫంక్షన్ హాల్ యజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చిక్కం శ్రీను, శ్రీరామచంద్రమూర్తి, పి.శ్రీనివాస్, ఏఎస్ఐలు జంగా సత్యనారాయణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీలను కలిసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



ఎంపీ బోసు, నియోజకవర్గ పార్టీ అభ్యర్థి సూర్య ప్రకాష్‌లతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: రాష్ట్ర పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌లను ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టి బలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు శనివారం కలిశారు. ముగ్గురు నేతలను రామచంద్రపురంలో వేర్వేరుగా కలిసి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై, ప్రచార సరళిని విస్తృతం చేసే అంశంపై కొద్దిసేపు చర్చించారు. రాజమహేంద్రవరం రూరల్, రామచంద్రపురం నియోజకవర్గాలకు పార్టీ టిక్కెట్లు పొందిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సూర్య ప్రకాష్‌లను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అభినందించారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి కుడుపూడి త్రినాథ్ తదితరులున్నారు.

గౌతమ బుద్ధుడి మార్గం అనుసరణీయం



గొల్లపల్లి సూర్యారావును సత్కరిస్తున్న బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు

అమలాపురం రూరల్: మహర్షి గౌతమ బుద్ధుడు సూచించిన మార్గం అనుసరణీయమని, అందరూ ఆయన బాటలో పయనించాలని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సూచించారు. శనివారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాంతి, సమానత్వం, సన్మార్గం వంటి మార్గాల్లో నడవాలని భగవాన్ గౌతమ బుద్ధుడు సూచించారన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ ఆధ్వర్యంలో గొల్లపల్లిని ఘనంగా సత్కరించారు.

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి
- ముమ్మిడివరంలో కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్‌పర్సన్ రెడ్డి హేమ సుందరి

ముమ్మిడివరం: వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి అధికారులకు సూచించారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అజెండాలోని అంశాలను సమావేశంలో వివరిస్తుండగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ వార్డులలో శానిటేషన్ లేక దోమలు పెరిగిపోయి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, శానిటేషన్ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. దీనిపై కమిషనర్ వెంకటరామిరెడ్డి స్పందిస్తూ వార్డుల వారీగా శానిటేషన్ ప్రక్రియను పర్యవేక్షించి శానిటేషన్ పూర్తి స్థాయిలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే నగర పంచాయతీలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశానికి ఆ శాఖ అధికారి ఎందుకు హాజరు లేదన్నారు. టౌన్ అధికారి ఎన్నికల విధులలో ఉండటం వల్ల సమావేశానికి అందులో లేరని కమిషనర్ తెలిపారు. అనంతరం అజెండాలో పొందుపర్చిన వేసవిలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థానిక సంస్థలతో అవుట్ సోర్సింగ్ వర్కర్లను కేటగిరి–2గా విభజించి వారిని క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్లుగా మార్పు చేయడం, వారికి ఈపీఎఫ్, ఈఎస్ఐ రూల్సు వర్తింప చేస్తూ నెలకు రూ.21 వేలు వేతనం మంజూరు చేయడానికి కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. సమావేశంలో వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి పోటీలో 26 మంది అభ్యర్థులు

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు 26 మంది బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి ఎ.కులొంతుంగన్ తెలిపారు. వీరిలో ఏకంగా 19 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులే కావడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 30 ఆఖరు తేదీ కావడంతో అధికారులు అభ్యర్థుల జాబితా ఖరారుతో పాటు వారికి గుర్తులు సైతం కేటాయించారు. బీజేపీ నుంచి నమశ్శివాయం, కాంగ్రెస్ నుంచి వైద్యలింగం, బహుజన సమాజ్ పార్టీ నుంచి అలంగరవేలు, ఏఐఏడీఎంకే నుంచి జి.తమిళవేదన్ నిలిచారు. కమ్యూనిస్టు పార్టీ నుంచి పి.శంకరన్, యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ నుంచి కె.ప్రభుదేవన్, నామ తమిళియార్ పార్టీ నుంచి డాక్టర్ ఆర్.మేనక, ఇండిపెండెంట్లుగా అరదాడి పోసియ్య, అరుణాచలం, ఇ.అనంతవేలు, ఎస్.కళ, ఎం.కృష్ణమూర్తి, కె.కిషోర్‌కుమార్, కుట్టాని, కుల్లాన్‌జ్యిప్పాన్, ఎస్.సతీష్‌కుమార్, నిర్మలగోపి, ఎస్.భక్తవత్సలం, ఎం.మణికందన్, వీపీ మాణిక్యం, ఎస్.మాస్కో, మురుగన్, రవీంద్రన్, రామదాస్, పి.రాజన్, ఆర్.రాజా బరిలో నిలిచారు.

వృద్ధాశ్రమానికి ఏసీ బహూకరణ



వృద్ధాశ్రమానికి అందించిన ఏసీతో గ్రామస్తులు

మలికిపురం: మండలం విశ్వేశ్వరాయపురంలోని వృద్ధాశ్రమానికి అంతర్వేదిపాలెం గ్రామానికి చెందిన జంపన రాంబాబురాజు ఏసీని బహూకరించారు. తనకు మనుమడు పుట్టిన సందర్భంగా ఆ బాలునికి ఆశీస్సులు కోరుతూ వృద్ధాశ్రమానికి ఒక ఏసీని బహూకరించారు. ఆయన ఆప్తమిత్రుడు ముదునూరి ప్రసాదరాజు ద్వారా దీనిని అందించారు. ఆశ్రమంలోని వృద్ధులు ఎండాకాలంలో చాలా అవస్థలు పడుతున్నారని గమనించిన ప్రసాదరాజు తన మిత్రులు రాంబాబురాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఏసీని అందించారు. కార్యక్రమంలో ముదునూరి విష్ణుమూర్తి రాజు, సాయిరాజు, వర్మరాజు, చేకూరి శ్రీనివాసరాజు, మానవతా మూర్తులు –సేవా సంస్థ అధ్యక్షుడు బోనం రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అయినవిల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మామ, బావ మరిది తోడికోడలు, ఆడపడుచుపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి. రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలం కె.జగన్నాథపురానికి చెందిన దొమ్మేటి లత దుర్గాదేవికి కాకినాడకు చెందిన సురేంద్రకు 2018లో వివాహం అయ్యింది. పెండ్లి సమయంలో సురేంద్రకు రూ.3.5 లక్షలు నగదు, 35 కాసుల బంగారం, 300 గజాలు స్థలం, రూ.2 లక్ష సారె ముట్టజెప్పారు. కొంత కాలం వీరి కాపురం సజావుగానే సాగింది. కొన్నాళ్లుగా భర్త సురేంద్ర, అత్త, మామ, భావ, మరిది, తోడి కొడలు, అడపడుచు అదనపు కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని కొట్టి చంపుతామని బెదరిస్తున్నారని లత దుర్గాదేవి అయినవిల్లి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేంకటేశ్వర ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. రంగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. ఈసందర్భంగా ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామిని ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: అయినవిల్లి మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం మొక్కు చెల్లించారు.